క్లుప్తంగా

పనుల్లో నాణ్యత పాటించాలి

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.23లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మిరియాల రమేశ్, హరీశ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కోఆప్షన్ సభ్యుడు అయూబ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కాశీవిశ్వనాథుడి రథోత్సవం



ఊరేగింపులో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాక: పట్టణంలో కాశీవిశ్వనాథుడి రథోత్సవం మంగళవారం కనుల పండువగా సాగింది. ఉదయం అగ్నిగుండాలు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య, హనుమాన్ స్వాముల కోలాటాలతో ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవాన్ని పట్టణంలోని పుర వీధుల గుండా ఘనంగా ఊరేగించారు. మంగళ హారతులతో, కొబ్బరికాయలతో మహిళలు స్వామి వారికి స్వాగతం పలికారు. ఈ ఊరేగింపులో ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

మున్సిపల్ జవాన్‌కు సన్మానం



సారయ్యను సన్మానిస్తున్న వజ్రోత్సవ కమిటీ సభ్యులు

హుస్నాబాద్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల హుస్నాబాద్ మన బడి వజ్రోత్సవాల కార్యక్రమంలో విశిష్ట సేవలందించిన మున్సిపల్ కార్మికుల జవాన్ సారయ్యను మంగళవారం వజ్రోత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి వజ్రోత్సవాల జ్ఞాపికను అందజేశారు. వారంరోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రతి రోజు సారయ్యతో పాటు మున్సిపల్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారని వారి సేవలు మరువలేవని కమిటీ సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో వజ్రోత్సవాల కమిటీ కన్వీనర్ కొండా లక్ష్మణ్, హెచ్‌ఎం మనీల, కమిటీ సభ్యులు లింగమూర్తి, పందిల్ల శంకర్, వీరన్న యాదవ్, కొత్తపల్లి అశోక్, వెంకటరమణ, చింతకింది శ్రీనివాస్, బూట్ల రాజమల్లయ్య, వెంకట రమణారెడ్డి, రాజగోపాల్‌రావు ఉన్నారు.

ఆహ్వానం అందజేత

వర్గల్(గజ్వేల్): వర్గల్ వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఆహ్వానిస్తూ ఉత్సవ నిర్వాహకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ టేకులపల్లి రాంరెడ్డి బ్రహ్మోత్సవ పత్రిక అందజేశారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఎంపీని కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఆయన వెంట బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి



కోమటి చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్

సిద్దిపేటకమాన్: వర్షాలు కురుస్తున్నందున పట్టణంలో వర్షం నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ సూచించారు. పట్టణంలోని కాళ్లకుంటకాలనీ, కోమటిచెరువు, పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ మంగళవారం పర్యటించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సిద్దార్థ హైస్కూల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

బెజ్జంకి(సిద్దిపేట): అసిస్టెంట్ కలెక్టర్, హుస్నాబాద్ ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఫైజన్ అహ్మద్ మంగళవారం బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. భూ సమస్యలున్న బాధితులు దరఖాస్తు చేసుకున్న పహాణీలను త్వరగా ఇవ్వాలన్నారు. ధరణిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ పార్థసారథి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేణుగోపాలుడు సిద్ధం

- ముస్తాబైన వర్గల్ ఆలయం
- నేటి నుంచి 11 రోజుల పాటు నిర్వహణ



వర్గల్ వేణుగోపాలుడి ఆలయం



స్వామివారి మూలవిరాట్

వర్గల్(గజ్వేల్): ఎనిమిది శతాబ్దాల క్రితం నిర్మించిన వర్గల్ వేణుగోపాలుని ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఆలయంలో బుధవారం నుంచి 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలో వర్గల్ నడిబొడ్డున సంతాన కల్యాణ వేణుగోపాలస్వామి ఆలయం ఉంది. భారీ రాతి స్తంభాలు, అద్భుత శిల్పకళతో కూడిన ఆనవాళ్లు ఈ ఆలయం సొంతం. గర్భగుడిలో ఏకపీఠంపై రుక్మిణి, సత్యభామ, వేణుగోపాలుడు కొలువుదీరిన ఈ ఆలయం ఎదుట కల్యాణ మండపం, ఆకాశన్నంటే విమాన రథం, రథశాల, ఏడంతస్తుల కోనేరు ఉన్నాయి.

రోజువారీ వివరాలు

ఈ నెల 3వ తేదీ బుధవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు బాలభోగం, అంకురార్పణ, 4వ తేదీ గురువారం ధ్వజారోహణం, 5వ తేదీ శుక్రవారం ఉదయం అష్టోత్తర శత కలశాభిషేకం, రాత్రి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 6వ తేదీ శనివారం గరుడ వాహన సేవ, 7వ తేదీ ఆదివారం గజవాహన సేవ, 8వ తేదీ సోమవారం హనుమత్ వాహన సేవ, 9వ తేదీ మంగళవారం శేషవాహనోత్సవ సేవ, 10వ తేదీ బుధవారం పొన్నవాహన సేవ, 11వ తేదీ గురువారం సుదర్శన హోమం, 12వ తేదీ శుక్రవారం రథ ప్రతిష్ఠ, విమాన రథంపై స్వామివారి ఊరేగింపు ఉంటాయి. 13వ తేదీ శనివారం చివరిరోజు శతఘటాభిషేకం, చక్రతీర్థం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని గీతాజ్ఞాన మండలి ప్రతినిధులు, ఆలయ పునర్నిర్మాణ దాత రాంరెడ్డి కోరారు.

ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం

5వ రోజుకు చేరిన జేపీఎస్‌ల సమ్మె



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జేపీఎస్, ఓపీఎస్‌లు

సిద్దిపేటరూరల్: జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులరైజేషన్ కోరుతూ కలెక్టరేట్ వద్ద చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 4 ఏళ్ల ప్రొబేషన్ కాలాన్ని పూర్తయినా ప్రభుత్వం నేటికీ రెగ్యులరైజేషన్‌పై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తమను రెగ్యులర్ చేసేంతవరకు ప్రభుత్వంపై శాంతియుతంగా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్ని మండలాల జేపీఎస్ సంఘాల అధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. సమ్మెకు ధర్మ సమాజ్ పార్టీ, సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కారోబార్ అసోసియేషన్, జీపీ పారిశుధ్య జిల్లా కమిటీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జేపీఎస్‌ల అధ్యక్షుడు నాగరాజు, కార్యవర్గ సభ్యులు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మావిడాల కనకయ్య పాల్గొన్నారు.

దళారులకు నమ్మి మోసపోవద్దు



సిద్దిపేటరూరల్: మాచాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

సిద్దిపేటరూరల్: దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని, వర్షాల కారణంగా తడిసిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నగుండవెల్లి, ఇర్కోడ్, తోర్నాల, చింతమడక, సీతారాంపల్లి, మాచాపూర్, గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం విజయనిర్మల, వైస్ ఎంపీపీ యాదయ్య, సర్పంచ్‌లు రఘోత్తంరెడ్డి, హంసకేతన్ రెడ్డి, భాగ్యలక్ష్మిబాలయ్య, ఉపసర్పంచ్‌లు స్వామి, రవి, శ్రీనివాస్, ఎంపీటీసీలు బాబు, చంద్రం, నాయకులు నాగరాజు, సీసీలు హన్మంతరెడ్డి, ఏఈఓలు గీత, కల్పన, వీఓ లీడర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): తొగుట వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ లతానరేందర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఎంపీటీసీ లలితరమేశ్, పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ యాదగిరి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ రాంరెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు కనకయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, పీఏసీఎస్ సీఈవో గంగారెడ్డి, ఐకేపీ ఏపీఎం మగ్దూం, ఏఎంసీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని జాలపల్లి, దూళ్మిట్ట పీఏసీఎస్ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డితో కలిసి చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాదగిరి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల, రాంసాగర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ తలారి కీర్తన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బోడుగాం పద్మ, తాడూరి రవీందర్, ఎంపీడీవో అనురాధ, ఐకేపీ ఏపీఎం ప్రసాద్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సంపూర్ణ, మర్రిముచ్చాల గ్రామ సమాఖ్య అధ్యక్షులు సంగీత, తాడూరి శోభ, సీసీ బాబు, రైతులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



అమ్మవారికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామంచలో రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవంలో ఆమె పాల్గొని పూజలు చేశారు. అమ్మవారి దయతో ప్రజలు సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. చిన్నకోడూరులో మహిళా ఆరోగ్య పథకం పరిశీలించారు. అల్లీపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని, స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మహిళా ఆరోగ్య పథకం మహిళలకు వరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్‌లు రాజాబాయ్, సంతోషి, ఎంపీటీసీలు లచ్చయ్య, వెంకటలక్ష్మి, వైద్యులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో కల్వర్టు నిర్మాణం



కల్వర్టుపై రైతులు

మద్దూరు(హుస్నాబాద్): నక్కొని ఒర్రెకు అవతల వైపున ఉన్న తమ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు గాను రైతులు తమ సొంత ఖర్చులతో కల్వర్టును నిర్మించుకున్నారు. దూళ్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన 20 మంది రైతులు తమ సొంత వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు నక్కొని ఒర్రెను దాటాల్సి ఉంది. కానీ వర్షాకాలంతో పాటుగా, ఇతర సమయాల్లో నీరు ప్రమాదకరంగా ఉండటంతో ఒర్రె దాటడానికి రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించిన పట్టించుకోలేదు. దీంతో విసుగు చెందిన రైతులు 300 మీటర్ల మేర మట్టిరోడ్డు, అదేవిధంగా నక్కొని ఒర్రెపై కల్వర్టు నిర్మించారు. మంగళవారం ఈ కల్వర్టును ప్రారంభించిన రైతులు మాట్లాడుతూ.. తమ బాధలను ఏ అధికారి, నాయకులు పట్టించుకోకపోవడంతో తామే సొంత డబ్బులతో రోడ్డు, కల్వర్టు నిర్మించుకున్నామని తెలిపారు.

ఆహ్వానం



మంత్రి హరీశ్‌రావుకు పత్రిక అందిస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): హనుమాన్ ఆలయంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీవరకు నిర్వహించే విగ్రహపునఃప్రతిష్ఠోత్సవాలకు రావాలని మంత్రి హరీశ్‌రావుకు హైదరాబాద్‌లోని తమ నివాసంలో కలిసి మంగళవారం ఆలయ ట్రస్టు గౌరవ అధ్యక్షుడు మాధవశర్మ ఆహ్వాన పత్రికను అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఆలయ ట్రస్టు అధ్యక్షుడు సాయిని మహేశ్, సభ్యులు సంతోష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, అజయ్, కార్తీక్‌శర్మ, సర్పంచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పని చేస్తున్న హమాలీ కార్మికులకు మంగళవారం ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మేడే పురస్కరించుకొని కార్మికులకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. మార్కెట్‌కు వచ్చే సమయంలో తప్పకుండా డ్రెస్‌కోడ్ పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజని, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, జెడ్పీటీసీ మంగ, మార్కెట్ కార్యదర్శి సుజిత్, కౌన్సిలర్ సుప్రజ, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

జగదేవ్‌పూర్ మండల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఎంసీ చైర్మన్ మదాసు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కార్యాలయంలోని ఎంపీపీ బాలేషంగౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. జగదేవ్‌పూర్‌లోని 1వ వార్డులో తాగు నీటి సమస్య ఉందని ఎంపీటీసీ కవిత సభ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా పీర్లపల్లి ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఛార్జీల పేరుతో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. స్పందించిన తహసీల్దార్ రఘువీరారెడ్డి అధిక డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. మోడల్ పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, పాఠశాల చుట్టూ ప్రహరీ లేదని, తాగునీటి సమస్య ఉందని తెలిపారు. పీర్లపల్లి సర్పంచ్ యాదవరెడ్డి గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రావడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, బిల్లులు వస్తాయని పీఆర్ఏఈ దేవయ్య తెలిపారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ మదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలిపారు. జగదేవ్‌పూర్ మండల అభివృద్ధి ఆదర్శంగా మారిందన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు భగవాన్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు



అనంతసాగర్‌లో పంటలను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు ఆందోళన చెందొద్దని, ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందిస్తుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అనంతసాగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో అకాల వర్షాలతో పంట నష్టం జరిగిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లావణ్యమల్లేశం, లక్ష్మీరమేశ్, ఏఓ వసంతరావు, రైతులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని మజీద్‌పల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ద్యావని స్వామి కుటుంబీకులను పరామర్శించి రూ.2లక్షల పార్టీ బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, జెడ్పీటీసీ బాలుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గజ్వేల్: మేడే సందర్భంగా సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రమ శక్తి అవార్డును దక్కించుకున్న బీఆర్ఎస్‌కు అనుబంధంగా పని చేస్తున్న ఆటో యూనియన్ రాష్ట్ర నాయకుడు గజ్వేల్‌కు చెందిన శగర్ల బాల్‌రాజు యాదవ్‌ను ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిద్దిపేటరూరల్: వడగండ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులను ఆదుకోవాలని కోరుతూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జశ్వంత్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన పంటలను వందశాతం నమోదు చేయాలని, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ ప్రముఖ్ మహేందర్‌రెడ్డి, న్యాయ ప్రముఖ్ శ్రీనివాస్‌రావు, మహిళ ప్రముఖ్ నిర్మల, సిద్దిపేట మండల అర్బన్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): కల్యాణలక్ష్మి పేదింటి ఆడపిల్లలకు వరమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని బేగంపేట, లక్ష్మీపూర్, వడ్లూరు గ్రామాల్లో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వడ్లూరి పరశురాములు, చింతకింది పరశురాములులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కవిత, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అనంతరం బెజ్జంకి మండల అంబేడ్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కల్లూరి రవిని ఎమ్మెల్యే బేగంపేటలో శాలువా కప్పి సన్మానించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే తీవ్ర నష్టం

తడిసిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్



మొలకెత్తిన ధాన్యం వద్ద రైతులు, కాంగ్రెస్ నేతలు

అక్కన్నపేట(హుస్నాబాద్): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రంలో వరికుప్పలు తడిసి ముద్దయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం అక్కన్నపేట మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కిన్నెర కొమురయ్య అనే రైతు వరికుప్పల అడుగుభాగంలో మొలకెత్తిన వరి ధాన్యాన్ని చూపిస్తూ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. సకాలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతోనే ఈ దుస్థితి వచ్చిందన్నారు. కాగా మరో పక్క మంగళవారం నుంచి కొనుగోలును ప్రారంభించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్లయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లారెడ్డి, రైతులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకొని మెళకువలను నేర్చుకోవాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు దేశబోయిన నర్సింలు పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ మైదానంలో జిల్లా యువజన సంక్షేమ, క్రీడా శాఖ సహకారంతో కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి కాల కరాటే శిక్షణ శిబిరాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **కార్మికులకు అండగా బీఆర్ఎస్**

చేర్యాల(సిద్దిపేట): కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అన్నారు. మంగళవారం బీఆర్‌కేయూ జిల్లా కార్యదర్శి ముస్త్యాల గణేశ్‌తో కలసి లేబర్ బోర్డు ద్వారా మంజూరైన కార్మిక కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రానికి చెందిన యాట కనుకయ్యకు రూ.30వేలు, కనకయ్యకు రూ.30వేలు, పోతిరెడ్డిపల్లిలో ఇటీవల మరణించిన పోలోజు ఈశ్వరయ్య కుటుంబానికి రూ.1లక్ష 30వేలు, కడవేర్గులో మరణించిన లింగంపల్లి నర్సింహులు కుటుంబానికి రూ.1లక్ష 30వేల చెక్కులను అందించారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ నరేందర్, రాజు, అన్నబోయిన స్వామి, నాయకులు మల్లేశం, బాలరాజు, నర్సింహులు పాల్గొన్నారు.

◆ **నేనుంచి షోలాపూర్‌కు ఆర్టీసీ డీలక్స్ బస్సు**

సిద్దిపేటకమాన్: ప్రయాణికుల సౌకర్యార్థం కోసం సిద్దిపేట ఆర్టీసీ డిపో నుంచి ఆర్టీసీ డీలక్స్ బస్సు సేవలను నేడు (బుధవారం) రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నట్లు సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట నుంచి ప్రతిరోజు ఉదయం 6.30 గంటల నుంచి, సాయంత్రం 6.20 గంటలకు షోలాపూర్‌కు, షోలాపూర్ నుంచి సిద్దిపేటకు ఉదయం 7.30 గంటలకు, రాత్రి 10 గంటలకు, అదేవిధంగా సిద్దిపేట నుంచి జేబీఎస్‌కు మధ్యాహ్నం 12.30 గంటలకు డీలక్స్ బస్సు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

◆ **మండల పరిషత్ ఉద్యోగులకు అదనపు బాధ్యతలు**

హుస్నాబాద్‌రూరల్: మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ముగ్గురు రెగ్యులర్ కార్యదర్శులు ఉన్నారు. 14 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వీరు ఏప్రిల్ 28 నుంచి సమ్మె చేస్తున్నారు. డీపీఓ ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిషత్ ఉద్యోగులకు గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. జే.సత్యనారాయణ(ఎంపీఓ) మీర్జాపూర్, వంగరామయ్యపల్లి, భల్లునాయక్‌తండా, డి.ప్రజ్వల్ (జూనియర్ సహాయకుడు) తోటపల్లి, మాలపల్లి, కే.రాంరెడ్డి (టైపిస్టు) రాములపల్లి, జె.రవీందర్‌రావు (సీనియర్ సహాయకుడు) ఉమ్మాపూర్, నాగారంలకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. మరో ముగ్గురు కార్యదర్శులు కే.ఎల్లయ్యకు పోతారం(ఎస్)గాంధీనగర్, జిల్లెలగడ్డ, రవీందర్‌రెడ్డికి మహ్మదాపూర్, మడద, పొట్లపల్లి, శ్రీలతకు బంజేరుపల్లి, కూచనపెల్లి, పందిల్ల గ్రామాలకు అదనపు బాధ్యతలను అప్పగించినట్లు ఎంపీడీఓ కుమారస్వామి పేర్కొన్నారు.

◆ **నియామకం**

దుబ్బాక: జాతీయ ఉపాధి హామీ పథకం క్షేత్ర స్థాయి సహాయకుల రాష్ట్ర అధ్యక్షుడిగా దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, ఎంపీడీఓ రాజేశ్‌కుమార్ ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముబారస్‌పూర్ సర్పంచ్ యాదగిరి, సూరంపల్లి ఉపసర్పంచ్ స్వామి, తదితరులున్నారు.

◆ **కార్యదర్శుల సమ్మెకు సర్పంచ్ మద్దతు**

మర్కూక్(గజ్వేల్): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతుగా మంగళవారం మండలంలోని పాతూరు సర్పంచ్ అరుణనర్సింలు గ్రామ పంచాయతీకి తాళం వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శి రాకపోవడంతో గ్రామంలో సమస్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. కార్యదర్శుల సమ్మెకు మద్దతుగా పంచాయతీ భవనానికి తాళం వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు**

దుబ్బాక: మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో గల మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం బలగం నటుడు ఐరేని మురళీధర్‌గౌడ్ దంపతులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దంపతులను దుబ్బాక మాజీ ఏఎంసీ చైర్మన్ దేవేందర్ శాలువా కప్పి సన్మానించారు.

◆ **ఉద్యోగ భద్రత కల్పించాలి**

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామ పంచాయితీల్లో పని చేస్తున్న సిబ్బంది వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలపై ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలీచాలనీ వేతనాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 51 జీఓను రద్దు చేయాలన్నారు. జనాభా ప్రాతిపదికన నిబంధన తొలగించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

◆ **ధ్యానంతో మానసిక ప్రశాంతత**

దుబ్బాక: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని సీనీ ఫైట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్, ధ్యాన గురువు నరసింహగౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో పిరమిడ్ స్పిరిచువల్ మూమెంట్(పీఎస్ఎస్ఎం) ధ్యాన మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుతున్న జీవన శైలిలో ఆరోగ్యం కోసం ధ్యానంపై దృష్టి సారించాలన్నారు. దుబ్బాకలో ఏర్పాటు చేసిన పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం సభ్యులు కమల, సాయిబాబా, ఆకుల శ్రీనివాస్, భానుచందర్, సతీష్, మాస్టర్లు, తదితరులున్నారు.

◆ **కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి**

చేర్యాల(సిద్దిపేట): ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్ ఆరీఫాకు వినతిపత్రం అందించారు.